
ప్రజాశక్తి

సోమవారం 7 ఆగస్టు 2023





వ్యవసాయబోరు బావి వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండలంలోని ఒంటిపాళ్యం గ్రామస్తులు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. నెలరోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. నీటి కోసం కిలోమీటరు దూరంలో ఉన్న రైతుల పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అది కూడా వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే రైతుల బోరుబావుల వద్ద నీరు తెచ్చుకోవాల్సిందని వాపోతున్నారు. పనులకు వెళ్లకుండా తాగునీటి కోసం రైతుల బోరుబావుల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. గ్రామంలో ఉన్న బోరు బావిలో మోటరు చెడిపోయిందని సర్పంచి పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు, నాయకులకు పలుమార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగడానికి తమ గ్రామానికి వచ్చిన నాయకులకు తగినబుద్ధి చెబుతామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



చిన్న, పెద్ద తేడా లేకుండా తాగునీటిని తీసుకెళుతున్న గ్రామస్తులు

అస్తవ్యస్తంగా సచివాలయ వ్యవస్థ

43 సచివాలయాల్లో 157 పోస్టులు ఖాళీ
హిందూపురానికి రామంటున్న సెక్రటరీలు
అక్కడి పరిస్థితులు, వార్డుల్లో నాయకుల ఒత్తిళ్లే కారణం



ఓ సచివాయలంలో సెక్రటరీలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



10 మంది సెక్రటరీలు ఉండాల్సిన చోట ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పురపాలక సంఘంలో 43 సచివాలయాలు ఉంటే అన్ని సచివాయాల్లోను పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏకంగా 157 సెక్రటరీల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రతి సచివాయంలోను సుమారు 540 సర్వీసులను ఆయా విభాగాల సెక్రటరీలు అందించాల్సుంటే ఇందులో 54 సర్వీసులు అందడం లేదు. 43 సచివాయాల్లో ఒక్కొక్క సచివాలయంలో 10 విభాగాల లెక్కన 430 మంది సెక్రటరీలు ఉండాలి. ఇందులో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మ్యాన్లు మినహాయిస్తే 9 విభాగాల్లో 387 మంది సెక్రటరీలు ఉండాలి. అయితే మున్సిపాలిటీ పరిధిలో ఏకంగా 157 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం 230 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి పరిస్థితులు, వార్డుల్లో నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేక సిబ్బంది ఇక్కడికి రావడానికి ముందుకు రావడం లేదన్న వ్యాఖ్యానాలు వినపిస్తున్నాయి. గత నెల జరిగిన సాధారణ బదిలీల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది వస్తారని అధికారులు భావించారు. అయితే ఇక్కడి నుంచి 40 మంది వివిధ ప్రాంతాలకు బదలీపై వెళితే, ఇతర ప్రాంతాల నుంచి కేవలం 18 మంది మాత్రమే వచ్చారు. ఇప్పటికే సచివాలయాల్లో వివిధ విభాగాల సెక్రటరీ పోస్టులు ఖాళీలు ఉండగా, బదలీల్లోను పెద్ద ఎత్తున సిబ్బంది వెళ్లి పోవడంతో ఏ సచివాలయంలో చూసిన ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే అమఒడి జగనన్న విద్యా కానుక, పాఠశాలల్లో మౌలిక వసతుల పర్యవేక్షణ ఇలా విద్యకు సంబంధించిన అంశాలతో పాటు జనన మరణ ధ్రువీకరణ పత్రం జారీ కావాలన్నా, పథకాల లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలన్నా, ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు, నూతన ఆధార్ తీయడం తదితర అన్ని పనులు విద్య డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి చూడాలి. పని భారంతో వారు అల్లాడిపోతున్నారు. ఇలాంటి కార్యదర్శుల పోస్టులు 16 ఖాళీగా ఉన్నాయి. మరో ఇద్దరు మాతృత్వ సెలవులో ఉన్నారు. ఇదే విధంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరు అందించాల్సిన వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీ పోస్టులు, వార్డుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అమ్యూనిటీ సెక్రటరీలు, జగనన్న భూ సర్వే కింద పట్టణమంతా ప్రతి భవనం స్థలం రీ సర్వే చేయడానికి పట్టణ ప్రణాళిక విభాగం సచివాలయ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హిందూపురం పురపాలక సంఘంలో ఏకంగా 28 విఆర్ఒ, 15 ప్లానింగ్ సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాలనలో కీలకమైన అడ్మిన్ కార్యదర్శులు ఏడు సచివాలయాల్లో లేరంటే ఇక్కడ పాలన ఎలా కొనసాగుతుందో అర్థమవుతుంది. అనేక సచివాలయాల్లో ఒకరిద్దరు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. వీరితోపాటు పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన కార్యదర్శులు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అమ్యూనిటీ కార్యదర్శులు, ఇలా అన్ని విభాగాల కార్యదర్శుల పోస్టులు ఖాళీ గానే ఉన్నాయి.

సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు

వార్డు సచివాలయాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది లేక ఆయా సేవల కోసం వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న సిబ్బందిని సైతం ఎన్నికల విధుల్లో భాగంగా బూత్ లెవెల్ అధికారులుగా నియమించి, ఇంటింటి సర్వే చేయిస్తున్నారు. దీంతో ఏ సచివాలయానికి వెళ్లినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి.

సర్వే పేరుతో డుమ్మా కొడుతున్న కార్యదర్శులు

హిందూపురం పురపాలక సంఘంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. ఉన్న సిబ్బందితో అధికారులు నెట్టుకొస్తున్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో, ఆయా సచివాలయాలకు వివిధ విభాగాల సెక్రటరీలను ఇన్‌ఛార్జులుగా నియమించారు. అయితే ఆయా విభాగాల సెక్రటరీలు అక్కడా, ఇక్కడా ఎక్కడా ఉండరు. అధికారులు అడిగితే వార్డులో సర్వే నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో, ఉన్న సెక్రటరీలు వారి విధులకు డుమ్మా కొడుతున్నారు.

సమస్యను అధికారులకు వివరించాం



హిందూపురం పురపాలక సంఘంలో ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న సెక్రటరీల వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయితే పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించకపోవడంతో ఉన్న సెక్రటరీలకు అదనపు బాధ్యతలు అప్పగించాం. ఉన్న సిబ్బందితోనే ప్రజలకు సేవలు అందే విధంగా చూస్తున్నాం. పురపాలక సంఘంలో కొంత మంది అధికారులను సచివాలయలకు పర్యవేక్షణ అధికారులుగా నియమించాము. ఇకపై సచివాలయాలను ఆకస్మిక తనఖీ నిర్వహిస్తాం. అందుబాటులో లేని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రమోద్ కుమార్,
మున్సిపల్ కమిషనర్, హిందూపురం

మణిపూర్ ఘటనను నిరసిస్తూ శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మణిపూర్‌లో జరిగిన సంఘటనలను నిరసిస్తూ ఆదివారం ధర్మవరం యునైటెడ్ ఫాస్టర్స్ వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. గాంధీనగర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో పట్టణంలోని చర్చిల ఫాస్టర్లు, సంఘ నాయకులు, సంఘ పెద్దలు, క్రైస్తవులు ప్లకార్డులు చేతబూని ఎన్టీఆర్ సర్కిల్, కళాజ్యోతి, కాలేజీ మీదుగా బస్టాండ్ సర్కిల్ చేరుకొని ఆ తర్వాత కాలేజీ సర్కిల్ వద్ద ప్రార్థనతో ముగిసింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు ఫాస్టర్ షేక్ మోషస్, కార్యదర్శి ఫాస్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మణిపూర్‌లో స్త్రీలపై జరిగిన అత్యాచారాలు, దమనకాండను ఖండించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టి ఘటనలకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో సహ కారదర్శి ఫాస్టర్ సులెమోన్, కోశాధికారి ఫాస్టర్ గే, పెద్దలు శామ్యూల్, సుందర్‌సింగ్, హోలీ లైట్ చర్చి ఫాస్టర్ మల్లెల రమేష్‌బాబుసుకుమార్, వివిధ చర్చిల ఫాస్టర్లు, సంఘ నాయకులు, సంఘ పెద్దలు, విశ్వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డాక్టర్ ఆఫ్తాబ్, తదితరులు

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్ షిప్ పోటీలకు బాల, బాలికలను ఎంపిక చేశారు. స్థానిక స్పార్టన్ చెస్ అకాడమీలో ఆదివారం అండర్-15 బాల, బాలికలకు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌బాబు, కార్యదర్శి నాగార్జున, టోర్నమెంట్ డైరెక్టర్ ఆరీఫుల్లాఖాన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-15 బాలుర విభాగంలో తనిష్క్, చింతా జయకృష్ణ, కేదార్‌నాథ్ గుప్తా, యశ్వంత్, బాలికల విభాగంలో వైష్ణవి, మోక్షిత, చందన సహస్ర, జ్ఞాపికరెడ్డి వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు. బాలురు ఈ నెల 24 నుంచి 27 వరకూ అనంతపురంలో, బాలికలు సెప్టెంబర్ 7 నుంచి 10 వరకూ గుంతకల్లులో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ ఛాంపియన్ షిప్-2023లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రభుత్వ చిన్నపిల్లల వైద్యుడు ఆఫ్తాబ్ బహుమతులను ప్రదానం చేసి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పురం విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై హిందూపురానికి మరింత గుర్తింపు తెచ్చారని కొనియాడారు. వీరు మరిన్ని ఉన్నతస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనపర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ శివక్రిష్ణ, జిల్లాలోని వివిధ ప్రాంతాల క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల జేబులు నింపడానికే జిల్లేడుబండ ప్రాజెక్టు

ఉమ్మడి జిల్లా టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరాం, పాల్గొన్న ఉమ్మడి జిల్లా టిడిపి ప్రధాన నాయకులు

ప్రజాశక్తి ముదిగుబ్బ, బుక్కపట్నం

శ్రీ సత్యసాయి జిల్లాలో ముదిగుబ్బ మండల పరిధిలో జిల్లేడుబండ ప్రాజెక్టు రైతుల కోసం నిర్మించడం లేదని.. అది సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి జేబులు నింపుకునేందుకే నిర్మిస్తున్నారని ఉమ్మడి జిల్లా టీడీపీ నాయకులు ఆరోపించారు. ఆదివారం ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లి తండా సమీపంలో ఉన్న జిల్లేడుబండ రిజర్వాయర్‌ను పరిశీలించారు. స్థానికంగా ఉన్న రైతులు, ముంపు బాధితులు, నిర్వాసితులతో టీడీపీ నాయకులు ఈసందర్భంగా మాట్లాడారు. వారి ఇబ్బందులు, అభ్యంతరాలను తెలుసుకున్నారు. ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల టిడిపి అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, పార్థసారధి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, కందికుంట ప్రసాద్, తిప్పేస్వామి, బండారు శ్రావణి, ఉమా మహేశ్వర్ నాయుడు, ఎం ఎస్ రాజు, నరసానాయుడు, అంబికా లక్ష్మినారాయణ, రాష్ట్ర, సాధికార కమిటీల అధ్యక్షులు, ఇతర టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రాజెక్టుల పేరుతో వైసీపీ నేతలు ఎలా దోచుకుంటున్నారో చెప్పేందుకు ఈ ప్రాజెక్టు ఉదాహరణగా నిలుస్తోందన్నారు. 300కోట్ల రూపాయలతో నిర్మాణం పూర్తయ్యే ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రెండింతలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ కు అత్యంత సన్నిహితుడైన తెలంగాణకు చెందిన కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఈ ప్రాజెక్టు అప్పజెప్పారన్నారు. అసలు ఈ ప్రాజెక్టు నిర్వాసితులతో కేతిరెడ్డి కానీ, అధికారులు కాని ఎప్పుడైనా మాట్లాడారా అని నిలదీశారు. ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి వచ్చి రైతులకు ఎలాంటి హామీ ఇవ్వకుండా కాకమ్మ కబుర్లు చెప్పి వెళ్లారని విమర్శించారు. రైతులను ఆదుకునేంత వరకు ఈ ప్రాజెక్టు నిర్మించడానికి వీలు లేదని... దీనిపై టీడీపీ పోరాడుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న ధరకు రెండున్నరింతల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడిపి ధర్మవరం ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ నిర్వాసితులకు కనీసం న్యాయం చేస్తామనిచెప్పే పరిస్థితుల్లో కూడా ఎమ్మెల్యే, అధికారులు లేరంటే పరిస్థితి ఎంత దారుణం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ఇక్కడ అమలు కావడం లేదన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గిస్తామని చెప్పే జగన్.. ఇప్పుడు ఎలా పెంచారని ప్రశ్నించారు. టిడిపి శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు పార్థసారధి మాట్లాడుతూ ప్రాజెక్టులకు తాము దానికి వ్యతిరేకం కాదని. కానీ ఇంత విస్తీర్ణంలో ఎందుకు కట్ట నిర్మిస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. రైతులు ఒప్పుకున్న తరువాతనే ప్రాజెక్టు నిర్మించాలని.. కానీ ఇక్కడ రైతులు వ్యతిరేకిస్తున్నా ప్రాజెక్టు నిర్మిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ ప్రధాని మోడీ తరహాలోనే సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే ఇదంతా కమీషన్ల కోసమేనన్నది అర్థమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాలవ శ్రీనివాసులు, పార్థసారధి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, కందికుంట ప్రసాద్, తిప్పేస్వామి, బండారు శ్రావణి, ఉమా మహేశ్వర్ నాయుడు, గుండుమల తిప్పేస్వామిచ ఎం ఎస్ రాజు, నరసానాయుడు, అంబికా లక్ష్మినారాయణ, వడ్డే వెంకట్ సామకోటి ఆదినారాయణ ముదిగుబ్బ బత్తలపల్లి తాడిమర్రి ధర్మారం రూరల్ కన్వీనర్లు రైతు సంఘం నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మానవజాతి మనుగడకు జల వనరులు కీలకం

జల వనరుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ రెడ్డి



జలవనరుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మానవజాతి మనుగడకు జల వనరులు కీలకమని జల వనరుల శాఖ జిల్లా అధికారి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మానవుడు తన అవసరాల నిమిత్తం నీటిని ఇష్టానురీతిన వినియోగిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని దాంతో గ్రామాలు, పట్టణాలు, అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలలోనూ నీటి ఎద్దడి నెలకొంటోందని ప్రభుత్వం ఎంతగా నిధులు ఖర్చు చేసినా సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. రుతుపవనాలు అనిశ్చిత ఉష్ణోగ్రతలు మార్పులతోపాటు జల సంరక్షణపై నిర్లక్ష్య కారణంగా రానురానూ నీటి ఎద్దడి జటిలమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో బావులు, బోర్లు, చెరువులు, వాగులు ఎండిపోవడం సర్వసాధారణమైందని దీంతో నీటి సంరక్షణ కొరకు రైతులు ఆరుతడి పంటలు వేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. ఎక్కువ నీటిని వినియోగించకుండా, వర్షపు నీటిని వృథా చేయకుండా ఒడిసిపట్టాలనికోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : సత్య సాయి జిల్లాలో నీటి సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: నీటి సంరక్షణలో భాగంగా సత్య సాయి జిల్లాలో వర్షపు నీటి సేకరణ, చెరువులు కాలవలు త్రవ్వడం, నీటి రిజర్వాయర్లను విస్తరించడం, వర్షపు నీటిని సేకరించేందుకు వివిధ పద్ధతులను అవలంబిస్తున్నాం. జల వనరులను సంరక్షణ అందరి బాధ్యత. వర్షపు నీటిని ఆదా చేయటం భూగర్భ జలాలను పెంపొందుతాయి. మానవజాతి మనుగడకు జల వనరులు కీలక పాత్ర వహిస్తున్నాయి. నీటి సంరక్షణ కొరకు చెక్‌డ్యాంలు, వర్షపు నీటి నిల్వ కేంద్రాలు, నిలువ చేయడానికి నీటి గుంతలు తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్ర : జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాది ఎంత వర్షపాతం నమోదు అవుతోంది ?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా జులై 2023 నాటికి సాధారణ వర్షపాతం 137.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 108.7 మిల్లీమీటర్లు కురిసింది. దీంతో 25.9 శాతం లోటు ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ బోర్లు 1,11,813 ఉండగా, 2023 జులై నాటికి 39.5 శాతం భూగర్భంలో నీటి నిల్వలు ఉన్నాయి. భూగర్భ జలాల నీటి స్థాయి 9.57 మీటర్లుగా నమోదయింది. భూగర్భ గల జలాల లభ్యత 39.5 కాగా వాటిలో వాడుకున్నది 22.4 టీఎంసీలు నిల్వ ఉంది. 17.1 టీఎంసీలు వృద్ధి చెందింది.

ప్ర : వాల్టా చట్టం అమలు చేస్తున్నారా?

జ: వాల్టా చట్టము జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నాం. జిల్లాలో 46 గ్రామాలను నిషిద్ధ గ్రామాలుగా ప్రకటించడం జరిగింది. మునుపటి సంవత్సరం 98 గ్రామాలు నిషిద్ధ గ్రామాలుగా ప్రకటించిగా ప్రస్తుతం ఈ సంవత్సరానికి 46 గ్రామాలకు కుదించడం జరిగింది. తమ గ్రామాలను వాల్టా చట్టం నిషిద్ధ గ్రామంగా తీసివేయాలని చాలామంది ప్రజలు కోరుతున్నారు .అయితే నిషిద్ధ గ్రామాల జాబితాను తయారు చేసేటప్పుడు ప్రభుత్వం వారు నిర్ణయించిన మేరకు గడచిన పది సంవత్సరాలు వర్షపాతాన్ని లెక్క కట్టడం జరుగుతుంది.

ప్ర : జిల్లాలో సాగు, తాగునీటికి భూగర్భ జలాలు సురక్షితమా ?

జ : సత్య సాయి జిల్లాలో భూగర్భ జలాలు, తాగటానికి వ్యవసాయానికి అనుకూలంగానే ఉన్నాయి. నీటిలో ఖనిజ లవణాలు తగినంత మోతాదులో ఉన్నాయి. ప్రస్తుతం వాటర్ ప్లాంట్ నందు నమూనాలను సేకరించి ప్రయోగశాలలో ఖనిజ లవణాల స్థాయిని పరీక్షించాం. జిల్లాలో వాటర్ ప్లాంట్ల వారు విక్రయిస్తున్న శుద్ధ జలాలు సురక్షితం కాదని ,ఈ నీటిని తాగడం వల్ల శరీరంలో ఉండే ఖనిజ లవణాలు, శరీరానికి కావలసిన శక్తిని సైతం కోల్పోవడం జరుగుతుందని ఈ పరీక్షల్లో తేలింది. గతంలో పంచాయతీలు, మున్సిపాలిటీ సరఫరా చేసే నీటిని తాగేవాళ్లం. అప్పుడు మన శరీరానికి కావలసిన ఖనిజ లవణాలు నీటి ద్వారా పుష్కలంగా అందేవి. ప్రస్తుతం వాటర్ ప్లాంట్ల నీటిని తాగుతుండడం వల్ల మన ఆరోగ్యాన్ని మన చేతులారా పోగొట్టుకుంటున్నాం. ఖనిజ లవణాలు, పోషక విలువలు లేకపోవడంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం .చిన్న చిన్న సందర్భాల్లో క్రిందపడితే చేతులు కాళ్లు విరిగిపోవడం జరుగుతున్నాయి, డాక్టర్లు సైతం ఈ నిజాన్ని ఒప్పుకుంటున్నారు.




ట్రోఫీతో కొండూరు జట్టు సభ్యులు

క్రికెట్ టోర్నీ విజేత కొండూరు

లేపాక్షి : మండల పరిధిలోని చోళసముద్రం గ్రామంలో జైశ్రీరామ్ ఆధ్వర్యంలో కరణం రామానందంస్వామి సహకారంతో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో కొండూరు జట్టు విజయం సాధించడంతో రూ. 20వేలు, ట్రోఫీ, రన్నర్స్ చోళసముద్రం జట్టుకు రూ. 10వేలతో పాటు మెమొంటో అందచేశారు. వారం రోజులుగా జరుగుతున్న టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కరణం రామానంద స్వామి మాట్లాడుతూ క్రీడల వల్ల యువతలో మానసిక ఉల్లాసం, దృఢత్వం, ఆరోగ్యం, మేధాశక్తిని పెంపొందడమే కాకుండా భవిష్యత్తు ప్రయాణానికి బాటలు వేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు అనిల్, పునీత్, నవీన్, అశోక్, సురేంద్ర, మోహన్ ఉన్నారు.

రైతు సంఘం నాయకుల అరెస్ట్

ముదిగుబ్బ : చలో విజయవాడ కార్యక్రమానికి ప్రభుత్వ అనుమతి లేనందున వెళ్లకూడదని సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి శివకుమార్, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిలను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్, వ్యవసాయ పొలాలకు మీటర్లు బిగించరాదని, రైతులకు ఎకరాకి రూ. 10వేలు ఇవ్వాలని, తదితర సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

9న మండల మీట్

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ ఎంపిపి జగన్మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ యాదవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, వైద్యం, విద్య, శిశు సంక్షేమం, జగనన్న గృహాలు, తదితర అంశాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు, ఎంపిటిసి, సర్పంచులు, పలు శాఖ అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన తెలిపారు

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువు : వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి భర్త రెడ్డప్పరెడ్డి, సర్పంచి రాధా తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆదివారం బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. పౌష్టికాహారం కిట్లు పొంది పౌష్టికాహార లోపం, రక్తహీనత, మాతా శిశు మరణాలను నియంత్రించాలన్నారు సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, అంగన్వాడీ టీచర్లు పద్మావతి, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో బాధితులను ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. వెంగళమ్మ చెరువు గ్రామంలో ఓ ఘర్షణలో గాయపడిన వైసిపి కార్యకర్త వీరనారప్ప కుటుంబాన్ని, వెన్ను నొప్పితో బాధపడుతున్న తలారి ఆంజనేయులు కుటుంబాన్ని, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నాగరాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ నరసారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్ నాయక్, వాటర్ షెడ్ ఛైర్మన్, నాయకులు, ఉన్నారు.

వసతిగృహంలో సౌకర్యాలు కల్పించాలి

పెనుకొండ :పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆదివారం హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో దళిత ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులను అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. సాయంత్రం నిర్వహించే స్టడీ హవర్స్, భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి భవనంలో సౌకర్యాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజి, రవికుమార్, నరసింహులు, మూర్తి, రాంపురం ఈశ్వరయ్య, కొగిర గంగాధర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోండి

కొత్తచెరువు : అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని అగ్రి గోల్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షబ్బీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ గతంలో ప్రజలను నమ్మించి ఏజెంట్ల ద్వారా ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిందని, తరువాత ప్రజలకు డబ్బులు ఇవ్వకుండా దివాలా తీసిందన్నారు. వైసిపి ప్రభుత్వం ఆదుకుంటామని గతంలో హామీ ఇచ్చింది గానీ నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇకనైనా ఆ సంస్థపై చర్యలు తీసుకొని తక్షణమే లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏజెంట్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

మడకశిర :మడకశిర పట్టణానికి చెందిన సుధాకర్ కడప నగరంలో హిమాలయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. ఆ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం రొళ్ల మండల పరిధిలోని బిజి హళ్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో డాక్టర్లు 150 మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు చేసి, ఉచిగంగా మందులు అందజేశారు. శిబిరంలో పిఆర్ఓలు వెంకటేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సెక్యులరిజం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దేశంలో లౌకికవాదం అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే నాగరాజు రెడ్డి, ఎఐసిసి సభ్యుడు కోటా సత్యం పేర్కొన్నారు. వారు ఆదివారం పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ కేసుపై సుప్రీంకోర్టు స్టే విధించడం హర్షణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కక్ష గట్టి రాహుల్‌పై కేసు పెట్టిందన్నారు. న్యాయ వ్యవస్థలు ఉండబట్టే ఇంకా న్యాయం నిలబడిందన్నారు. మణిపూర్‌లో అక్కడి బిజెపి ప్రభుత్వం మారణ హోమాన్ని పట్టించుకోలేదన్నారు. అక్కడ విలువైన భూములు కలిగిన గిరిజనులను హింసాత్మక సంఘటనల ద్వారా భయభ్రాంతు లను చేసి, ఆ భూములను బడా పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతుందన్నారు. ఆ సంఘటనలో 140 మంది మైనార్టీ వర్గాలు చనిపోయారని, 60 వేల మందికి పైగా గాయాలపాలయ్యారని, 2 వేల కుటుంబాలు వలస వెళ్లారన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగిం చినా ప్రధాని మౌనం వహించడం బాధ్యతారాహిత్య మన్నారు. బిజెపికి తన రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం దేశం ఎటుపోయినా పట్టించుకోదన్నారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఆంధ్రాలో బిజెపికి స్థానం ఉండదనే సహాయ నిరాకరణ చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను సమానంగా చూసిందని, విభిన్న మతాలను, సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ సెక్యులరిజం అమలు చేస్తుందన్నారు. ఇకనైనా మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని, అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌస్‌ఖాన్, వంకరకుంట సుధాకర్, పుట్ల గంగాద్రి పాల్గొన్నారు.


టేబుల్ టెన్నిస్ పోటీల ఓవరాల్ ఛాంపియన్స్, రన్నర్స్‌గా నిలిచిన కృష్ణా, తుంకూరు జట్లు

టేబుల్ టెన్నిస్ పోటీల ఛాంపియన్ 'కృష్ణా'

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విజేతగా కృష్ణా, రన్నర్స్‌గా తుంకూరు క్లస్టర్లు నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఆటగాళ్లకు ముఖ్యఅతిథిగా హాజరైన లేపాక్షి పిహెచ్‌సి డాక్టర్ చిరంజీవి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ పోటీల్లో చిత్రదుర్గ, కలబుర్గి, కృష్ణా, కర్నూలు, మహబూబ్‌నగర్, తిరువనంతపురం, తుంకూరు, వాయనాడ్ క్లస్టర్ల నుంచి ఆరుగురు బాలురు, ఆరుగురు బాలికల చొప్పున క్రీడాకారులు పాల్గొన్నారు. అన్ని క్లస్టర్ల నుంచి ఉత్తమ ఆటగాళ్లను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అండర్-14, 17, 19 గ్రూపుల్లో ఐదుగురిని ఎంపిక చేశారు. ప్రతి గ్రూపులో ముగ్గురు స్టాండ్‌బై గా నిలిచారు. బాలురు అండర్-14లో తరుణ్(వాయనాడ్), అండర్-17లో గగన్‌శ్రీ(తూర్పు గోదావరి-1), అండర్-19లో కెకెఎం స్వామి (తూర్పుగోదావరి-1), బాలికలు అండర్-14 వాత్స ల్య (చిక్‌మంగళూరు), అండర్-17 శ్రేయ(మైసూర్), అండర్-19 హాసిని(తూర్పు గోదావరి-1) ప్రథమ స్థానంలో నిలిచారు. మొత్తం 30 మంది ఉత్తమ ఆటగాళ్లను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అసఫ్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ నాగరాజన్, ప్రధానాచార్యులు నాగరాజు మాట్లాడుతూ ఇదే ప్రతిభ కొనసాగిస్తే క్రీడారంగంలో ఉన్న శిఖరాలు అధిరోహిస్తారని పేర్కొన్నారు. అనంతరం పోటీల నిర్వాహకులను, ముఖ్యఅతిథి చిరంజీవిని సత్కరించారు. అలాగే సహాయ నిర్వాహకులకు బహుమతులు అందజేసి అభినందించారు.

ప్రవీణ్ ప్రకాష్‌ను విధుల నుంచి తొలగించాలి

ప్రజాశక్తి -పెనుకొండ



సంఘీభావం తెలుపుతున్న యుటిఎఫ్ జిల్లా నాయకులు

ప్రవీణ్ ప్రకాష్‌ను ప్రభుత్వం తక్షణం విధుల నుండి తప్పించా లని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అధ్యక్షతన జిల్లా శాఖ అత్యవసర మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే లా, మానసిక వేదనకు గురిచేసేలా వ్యవహరించడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ విద్యారంగాన్ని తిరోగమనానికి తీసుకెళ్లే జిఒ-117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమంపై యుటిఎఫ్ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. త్వరలో వీటన్నిటిపై ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం పి.నాగార్జునరెడ్డి, ఎస్.గంగాధర్ యుటిఎఫ్ లో చేరారు. ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తానని జిల్లా నూతన ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ఎం.సుధాకర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో జిల్లా కోశాధికారిగా డి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శిగా కె.శివశంకర్, ఇటీవల జరిగిన బదిలీల కారణంగా ఖాళీలు ఏర్పడిన ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర, గౌరవాధ్యక్షులు కె.భూతన్న, సహాధ్యక్షులు పి.బాబు, కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శులు తహీర్‌వలి, ఈ.నారాయణస్వామి, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల సేవలోనే సంతృప్తి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్


మాట్లాడుతున్న యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకె శ్రీనివాసులు

పేద ప్రజల కు సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని యువర్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వైకె శ్రీనివాసు లు, సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, క్యాంపు ఛైర్మన్ గర్రె రమేష్ బాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూలులోని శ్రీచక్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ టెక్నీషియన్స్ రోగులకు కంటి వైద్య చికిత్స చేయడంతో కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలే కాకుండా, నేత్రదానం, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కంటి శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ లేదా ఈహెచ్ఎస్ నిబంధనల మేరకు ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. శిబిరం ఏర్పాటుకు దాతలు జయంతి గీతావాణి, జయంతి వినోద్ కుమార్, వారి కుమారులు ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. ఈ శిబిరంలో 60 మంది పాల్గొనగా 40 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి ఆదివారం సాయంత్రం కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ బివి సుబ్బారావు, పోలా ప్రభాకర్, బండ్లపల్లి రంగనాథం, చాంద్‌బాషా, ఒవి ప్రసాద్, బండి నాగేంద్ర, షీలా నాగేంద్ర, పిఆర్ఒ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహంతోనే చంద్రబాబు అరాచకాలు : ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

అధికార దాహంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు అరాచకాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడారు. అధికారం శాశ్వతంగా దక్కదు అనే ఆలోచనతో చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన పేరుతో బూటకపు పర్యటన చేపట్టారని విమర్శించారు. చంద్రబాబు వ్యవసాయం, రైతులు, సాగు నీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడితే ప్రజలు నమ్మరన్న విష యాన్ని గ్రహించిన టిడిపి శ్రేణులు దాన్ని తప్పుదోవ పట్టించేందుకు పుంగనూరు లాంటి సంఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎక్కడ చూసినా హింసకు పాల్పడడం, విద్వేషాలను రెచ్చగొట్టడం తప్ప నిజంగా సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడిన పరిస్థితి ఎక్కడా లేదన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఏ స్థాయికైనా దిగజారుతాడని మండిపడ్డారు. చివరకు తన పార్టీ నాయకులు, కార్యకర్తల చావులు కూడా కోరుకుంటానరి ఆరోపించారు. హింసను ప్రేరేపించినా, కుట్రకు పాల్పడినా ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా చట్ట ప్రకారం శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. చంద్రబాబు ఇటువంటి చర్యలకు మళ్లీ పూను కోకుండా, మళ్లీ ఇటువంటి అరాచకాలు సృష్టించుకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సింగిల్ విండో ఛైర్మన్ జయ, ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, కౌన్సిలర్లు మురళి, జిలాన్‌బాషా, మణికంఠనాయక్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

నేడు టిడిపి ఆధ్వర్యంలో
సాగునీటి ప్రాజెక్టుల సందర్శన

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గంలో సోమవారం(నేడు) టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించతల పెట్టిన సాగునీటి ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి నాయకులు పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్‌రెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు పార్థసారథి, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, కదిరి, ధర్మవరం, కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్, ఉమామహేశ్వరనాయుడు, తదితరులు ఉదయం 10 గంటలకు గుడిబండ మండల పరిధిలోని రాళ్లపల్లి రిజర్వాయర్ స్థల పరిశీలన, 12 గంటలకు రొళ్ల మండలంలోని రత్నగిరి రిజర్వాయర్ స్థల పరిశీలన, 12.30 గంటలకు రత్నగిరి కొల్లాపురి ఆలయంలో పూజలు, రొళ్ల మండల పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 1 గంటకు రొళ్లలో బహిరంగ సభ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మనోహర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్‌సాబ్, కౌన్సిలర్ ఉమాశంకర్, తెలుగు యువత అధ్యక్షుడు తిమ్మరాజు, ఐటిడిపి తాలూకా అధ్యక్షుడు కాంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

నటుడు మహేష్ అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


రక్తదానం చేస్తున్న మహేష్‌బాబు అభిమాని

ఈ నెల 9వ తేదీ సినీ నటుడు మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక హనుమాన్ కూడలిలో అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 30 మంది యువకులు రక్తదానం చేసి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా అభిమాని నరేష్ మాట్లాడుతూ మహేష్‌బాబు ఎందరో చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేయించి ప్రాణాలు నిలబెట్టారన్నారు. రెండు కుగ్రామాలను దత్తత తీసుకొని మౌలిక వసతులు కల్పించడంతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. మహేష్‌ను ఆదర్శంగా తీసుకొని తాము రక్తదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో నరేష్, సతీష్‌బాబు, మారుతి, చిన్న, నాని, కిష్టప్ప, సతీష్‌రెడ్డి, నాగార్జున, అశోక్, సురేష్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి కొనుగోలుకు జడ్‌పిటిసి ఆర్థికసాయం

ప్రజాశక్తి-బత్తలపల్లి


ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పిటిసి కోటి సుధ

మండల పరిధిలోని డి.చెర్లోపల్లి నుంచి పత్యాపురం తండాకు వెళ్లడానికి సరైన రహదారి లేకపోవడంతో తండావాసులు దాతల చేయూతతో రహదారి కొనుగోలుకు పలువురిని ఆశ్రయిసున్నారు. ఈ క్రమంలో ఆదివారం బత్తలపల్లిలోని ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జడ్పిటిసి కోటి సుధ దంపతులను కలిసి విన్నవించగా స్పందించిన వారు రూ. 10 వేలను అందజేశారు. డి.చెర్లోపల్లి నుంచి పత్యాపురం తండాకు గతంలో రైతు పొలం మీదుగా వెళ్లే వారు. అయితే రైతు అడ్డగించడంతో ఆ రైతుతో దారి కొనుగోలు చేస్తున్నట్లు తండావాసులు వారికి వివరించారు. గతంలో అధికారులకు విజ్ఞప్తి చేసినా న్యాయం జరగకపోవడంతో రైతుకు డబ్బులు చెల్లించి దారి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.


తాడిమర్రి సొసైటీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న వైటి చంద్రశేఖర్‌రెడ్డి

సొసైటీ అధ్యక్షులుగా వైటి చంద్రశేఖర్‌రెడ్డి ఎంపిక

బత్తలపల్లి : తాడిమర్రి సొసైటీ అధ్యక్షునిగా వైటి చంద్రశేఖర్‌రెడ్డిని ఆదివారం సింగిల్‌విండో డైరెక్టర్లు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి బాధ్యతను నాకు అప్పగించినందుకు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం సింగిల్‌విండో డైరెక్టర్లు అందరూ కలిసి ఆయనకు సన్మానం చేశారు. ఈ కారక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిఎంఎస్ ఛైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు బిల్లే ముత్యాలప్ప, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు


గద్దర్ మృతికి కమ్యూనిస్టుల దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల సిపిఎం, సిపిఐ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు బేకరీ గంగాధర్ వేర్వేరు ప్రకటనలు విడుదల చేస్తూ ఆయన మృతి ఉద్యమాలకు తీరని లోటన్నారు. జీవితాంతం నిరాడంబరంగా ఉంటూ బడుగు, బలహీన వర్గాల చైతన్యం కోసం నిత్యం కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. గర్జించే కంఠం మూగబోయిందని, ప్రభుత్వాలు ఎన్ని ఆంక్షలు విధించినా, తనదైన శైలిలో తన పాటలతో ఉద్యమాలకు చేయూత అందించారన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు, దళిత వర్గాలకు జీవితాంతం తోడు నీడగా నిలిచిన గద్దర్ ఇక లేరంటే జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఎన్నోసార్లు అజ్ఞాతవాసంలో కూడా తన పంథా మార్చుకోకుండా అణగారిన వర్గాల కోసం పనిచేసిన వ్యక్తి గద్దర్ అని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు.

ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం


సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

పురపాలక సంఘ వ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వేను ఆదివారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ప్రత్యేకాధికారి రమేష్ పరిశీలించారు. పట్టణంలోని ఆటోనగర్, హౌసింగ్ బోర్డు, తదితర ప్రాంతాల్లో సర్వే చేపట్టారు. ఓటరు జాబితాపై ఈ నెల 30వ తేదీ వరకూ బూత్ లెవల్ అధికారుల ద్వారా ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు వారు తెలిపారు. అలాగే బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్దిష్ట కాల పరిమితిలో సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని, సర్వే చేసే విధానం డ్రెస్ కోడ్, ఐడెంటిటీ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. పూర్తిగా సమాచారం సేకరించి వివరాలను రిజిస్ట్రేషన్ ద్వారా బుక్‌లో నమోదు చేసుకోవాలని, అదే సమయంలో ఓటరు జాబితాలో వివరాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఓటర్లు సైతం సర్వేకు వచ్చే బూత్‌లెవెల్ అధికారులకు సహరించాలని కోరారు. వీరి వెంట మున్సిపల్, రెవిన్యూ అధికారులు ఉన్నారు.

ఈతకెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని దొరిగల్లు గ్రామంలో పీర్ల పండుగకు బంధువుల ఇంటికి వచ్చిన ఓ యువకుడు సమీపంలోని మద్దలేరు వాగులోకి ఈతకు వెళ్లి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కదిరి రూరల్ మండల పరిధిలోని పట్నం గ్రామానికి చెందిన మహేష్(25) బెంగళూరులో ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూ ఉండేవాడు. వివాహం కాలేదు. పీర్ల పండగ ఉండడంతో దొరిగల్లులోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం సరదాగా మద్దలేరు వాగుకు వెళ్లారు. ఈత కొడుతున్న సమయంలో మూర్ఛవ్యాధి రావడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. సమాచారం తెలియడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమంత్‌కుమార్ తెలిపారు.

30 గొర్రెలు అపహరణ

మడకశిర రూరల్ : మండల పరిధిలోని బుల్ల సముద్రం సమీపంలో 30 గొర్రెలు అపహరణకు గురయ్యాయి. గుడిబండ మండలంలోని తిప్పాపురం గ్రామానికి చెందిన ఈరన్న మేత కోసం గొర్రెలను తీసుకొచ్చి బుల్లసముద్రం సమీపంలో టెంట్ వేసుకొని ఉండగా శనివారం రాత్రి దొంగలు 30 గొర్రెలను ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

పాముకాటుకు గురైన మహిళకు తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఇంట్లో నిద్రిస్తున్న మహిళను పాటు కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం మండల పరిధిలోని ఈదుల ముష్టూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. బిసి కాలనీకి చెందిన చెడిపోతుల పెద్దన్న భార్య కుళ్లాయమ్మ వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి వచ్చి మంచంలో నిద్రపోయింది. ఆ సమయంలో ఇంట్లోకి నాగుపాము ప్రవేశించి మంచంపై నిద్రిస్తున్న కుళ్లాయమ్మను కాటు వేసింది. దీంతో ఆమెను కాలనీ వాసులు హుటాహుటిన ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఐసియులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి మండల కన్వీనర్ దగ్గిరి బయపరెడ్డి, నాయకులు బండి నాగభూషణ, ముసలప్ప, లింగమయ్య, వెంగన్న, నరసప్పతో పాటు పలువురు ఆసుపత్రికి చేరుకుని బాధితులకు ధైర్యం చెప్పారు.

హనుమంతుకు పర్యావరణ మిత్ర స్ఫూర్తి పురస్కారం

ప్రజాశక్తి-మడకశిర


అవార్డు అందుకుంటున్న హనుమంతు

జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా అధ్యక్షతన ముస్లిం నగారా జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం పర్యావ రణ మిత్ర స్ఫూర్తి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖ్య అతిథులు అనంత విద్యా సంస్థల అధినేత అనంతరాముడు, ఎస్‌కెయూ తెలుగు ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం, స్వాతంత్ర్య సమరయోధులు మెళవాయి గోవిందరెడ్డి, పర్యావరణవేత్తలు భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, అభ్యుదయ రచయిత్రి విజయశ్రీ, సులోచనదేవి, ఉబెదుల్లా హుసేన్‌ల నుంచి డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పర్యావరణ జాతీయ కవితోత్సవంలో వివిధ రాష్ట్రాల నుంచి జాతీయస్థాయిలో వంద మంది కవులు పర్యావరణ పరిరక్షణపై తమ కవితలు వినిపించారు. అనంతరం రచయితల సంఘం ఆధ్వర్యంలో కవులను పర్యావరణ మిత్ర సత్కారంతో అభినందించారు. అలాగే పట్టుగూళ్ల మార్కెట్ ఆవరణలో మెక్కలు నాటారు. ప్రజా గాయకుడు గద్దర్, మణిపూర్ ఘటనలో మృతులకు సంతాపం తెలుపుతూ రెండు నిముషాలు మౌనం పాటించారు.


ఎంపికైనన నూతన కార్యవర్గ సభ్యులు

జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెవి అనిల్‌కుమార్(హిందూపురం), ఉపాధ్యక్షులుగా ఎం.చంద్రశేఖర్(ధర్మవరం), కె.ఇర్షాద్ అలీ(కదిరి), కార్యదర్శిగా బికె మహమ్మద్ సలీం(హిందూపురం), కోశాధికారిగా ఎస్.శేఖర్(హిందూపురం), సహాయ కార్యదర్శులు బి. కార్తీక్ (పరిగి), ఈ.శ్రీనివాసులు (కొత్తచెరువు), ఈసీ మెంబర్లుగా విజయవాణి(హిందూపురం), ఎస్.నవీద్(మడకశిర) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం జిల్లాలో ఫుట్ బాల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు.

చెలివెందుల పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్

హిందూపురం : రూరల్ మండల పరిధిలోని చెలివెందుల పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండేళ్ల క్రితం సర్పంచి మృతి చందగా అప్పటి నుంచి ఎన్నికలు జరగలేదు. ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నాయి. 8వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎంపిక చేసుకునే విధంగా అధికార పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు.

గద్దర్‌కు కవులు, రచయితలు, ప్రజా సంఘాల నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల ఆదివారం పట్టణంలోని కవులు, రచయితలు, ప్రజా సంఘాల నాయకులు స్థానిక టీచర్స్ కాలనీలో తపన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సడ్లపల్లె చిదంబరరెడ్డి, గంగాధర్, డా. అశ్వత్తనారాయణ, రాజశేఖర్ రెడ్డి, శొంఠి జయప్రకాష్, సిద్దగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉదయ్‌కుమార్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేర్వేరుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు గద్దర్ సేవలను కొనియాడారు.

నేటి నుంచి డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 7వ తేదీ నుంచి(సోమవారం) నుంచి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి ఆదివారం తెలిపారు. బి.ఎ, బి.కామ్., బి.ఎస్సీ. కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా హిందూపురం ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో సీట్లు కేటాయించబడిన విద్యార్థినులు సోమవారం లోపు కళాశాలకు వచ్చి అడ్మిషన్ నిర్ధారించుకోవాలన్నారు. సోమవారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, విద్యార్థినులు తప్పక హాజరుకావాలన్నారు. హాస్టల్ వసతి కావాల్సిన వారు డిప్యూటీ వార్డెన్ డాక్టర్ సరస్వతిని సంప్రదించాలని సూచించారు.

అద్దెలు తగ్గించాలని వినతి

ప్రజావక్తి-హిందూపురం

పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయ భవనంలో గదులు అద్దెకు తీసుకుని, ఇప్పటి వరకు వ్యాపారాలు ప్రారంభించ లేదని, కావున ఇప్పటి వరకూ అద్దెలు మాఫీ చేయడంతో పాటు అద్దెలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు వేణురెడ్డిని కోరారు. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు ఆదివారం ఆయన్ను కలిసి సమస్యలు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో న్యూ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ అధ్యక్షులు ఎస్.హిబ్బూర్ రెహ్మాన్, ఉపాధ్యక్షులు ఎస్.వినయ్, సెక్రటరీ నాగిరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఇమ్రాన్, ట్రెజరర్ చంద్రమోహన్, గౌరవాధ్యక్షులు సూర్యనారాయణ, మెంబ ర్లు, కౌన్సిలర్ నాగేంద్రబా బు, వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత రెడ్డి, భగీరథ, నవీన్, తదిత రులు పాల్గొన్నారు.


వేణు రెడ్డికి సమస్యలను వివరిస్తున్న వ్యాపారులు